సాదుం జయరాం కథలు

9

# తప్పుడు మనిషి

సాధారణంగా డాక్టరు యిల్లు చాలా హడావుడిగా వుంటుంది. ఆయన టౌన్లో అరడజను సాంస్కృతిక సంఘాలకు కార్యదర్శిగానో, అధ్యక్షుడిగానో పని చేస్తున్నారు. ఇక వృత్తిరీత్యా వచ్చిపోయే వాళ్ళు సరేసరి. ఇక యింట్లో హడావుడికి ఏం తక్కువ?

సాయంత్రం నేను వెళ్ళేసరికి డాక్టరు యింట్లోలేడు. రాముా డాక్టరుగారి నౌకరు ఒక్కడే వున్నాడు. వాడు నాకు చిరపరిచితుడే కుశల ప్రశ్నలు వేసి నన్ను గదిలో కూర్చోబెట్టాడు.

'డాక్టర్ లేడా?' అన్నాను.

'హాస్పిటల్ నుంచి ఈ పాటికే రావలసింది. ఏదో మెడికోలీగల్ కేసు వచ్చినట్లుంది. చీకటి పడుతోంది గనక పోస్టుమార్టమ్ అదీ వుదయం చేస్తాడు! కాసేపట్లో రావచ్చు. మీరు స్నానం చేసే టట్లయితే బాత్‌రూంకు వెళ్ళి స్నానం చెయ్యండి' అన్నాడు.

'ఇంట్లో అమ్మగారు కూడా వున్నట్లులేరే?' అన్నాను.

'లేరు. వారం రోజుల క్రిందట పుట్టింటికి వెళ్ళింది. ఇంకో వారం రాదేమో.' అన్నాడు.

నాకు కొంచెం రిలీఫ్ దొరికినట్లయింది. డాక్టర్ని ఏకాంతంగా కలుసుకునే అవకాశం లభిస్తుందనుకోలేదు. నేను మాట్లాడతలచుకున్న విషయానికి ఇంతకంటే మంచి సమయం దొరకదేమో. కానీ ఆ సమస్యని ఎలా కదపడమా అన్నదే నన్ను వేధిస్తున్న సమస్య. చాలా సున్నితమైన కుటుంబ విషయం. నాలాటి యితరుల ప్రమేయానికి ఆస్కారం లేని సమస్య.

'బాత్‌రూంలో టవలూ, సోపూ పెట్టాను. మీరు వెళ్ళి స్నానం ముగించండి. ఈలోగా డాక్టరుగారు కూడా రావచ్చు' అన్నాడు రామూ వచ్చి.

నాకు స్నానం చెయ్యాలనిపించలేదు. కాని యాంత్రికంగా బాత్‌రూంలోకి నడిచాను. స్నానం చేస్తున్నంత సేపూ నాలో ఒకే ఒక ఆలోచన ఈ మధ్యవర్తిత్వం ఎందుకు మీద వేసుకున్నానా అని. డాక్టరు నాకు మిత్రుడు కావచ్చు. ఇద్దరం ఒకే వూరివాళ్ళం కావచ్చు. అంతమాత్రాన డాక్టరు విషయాల్లో జోక్యం చేసికొనే హక్కు నాకు ఎక్కడుంది.? అతనికి నచ్చచెప్పడానికి నాకున్న అర్హతలు ఏపాటివి? ఈ విషయాలన్నీ తీరా ఇక్కడికి వచ్చిన తర్వాత ఆలోచిస్తున్నవిగావు. ముందే ఆలోచించాను. నేను ఎదొర్కోవలసిన విషమ సమస్యను గురించి ఆమెతో అనకనూపోలేదు. కానీ ఆమె నాకిచ్చిన సమాధానం ఏమీ లేదు. కళ్ళనిండా నీళ్లు నింపుకున్నది. ఆమె కడుపులోవున్న బడబానలం నాకు తెలుసు. ఇక ఆమెను మాట్లాడించీ లాభంలేదు. బయలుదేరి వచ్చాను.

అందరి తల్లులాంటి సమస్యా రత్నమ్మగారిదీ అయివుంటే నేను డాక్టరుగారితో మాట్లాడటానికి జంకేవాడినేకాదు. చిత్రమేమిటంటే రత్నమ్మగారిది లోకంలో అందరి తల్లుల్లాంటి సమస్య కాదు. కొడుకులు సరిగా చూడకపోవడం, కోడళ్ళు సరిగా చూడకపోవడం ఇవేకదా ఈ దేశంలో తల్లుల సమస్యలు. కానీ రత్నమ్మ గారిది ఈ సమస్య కాదు. డాక్టరు ఆమెను పువ్వుల్లో పెట్టి పూజించడానికి సిద్ధంగా వున్నాడు. డాక్టరు భార్య సరోజిని కూడా తీసివేసే మనిషి కాదు. ఇక డబ్బుతో కొనగల సౌఖ్యాల విషయం సరేసరి. అందమైన బంగళా, బంగళానిండా ఖరీదైన ఫర్నిచరు, కారు, బ్యాంక్‌లో అకౌంట్, వండటానికి పెట్టడానికి నౌకర్లు, రత్నమ్మ గారు ఇటు పుల్లతీసి అటుపెట్టనవసరంలేదు. అనుభవించడానికి అన్ని భోగ భాగ్యాలూ వున్నవి.

కానీ డబ్బుతో కొనగల సౌఖ్యాలు కొందరికి రుచించవు. జీవితంలో థ్రిల్ కావాలి. దాని ముందు ఐశ్వర్యం ఆడంబరం పూచిక పుల్లతో సమానం. రత్నమ్మగారు ఆకోవకు చెందిన మనిషి. డాక్టరుకు ఆమె రసికత్వం విషయం తెలియందేమీకాదు. చదువుకుంటున్న రోజుల్లో చూచీచూడనట్లు పోయాడు. నిజానికి అప్పుడామెను అదుపులో పెట్టగల సామర్థ్యమూ లేదు డాక్టరుకు. డాక్టరుకు డాక్టరు జీవితంలో స్థిరపడ్డాక మొదలయింది. ఆమెను అదుపులో పెట్టే ప్రయత్నం.

'అమ్మా! అక్కడికే వచ్చి మాతోపాటు వుండరాదూ' అన్నాడు.

'ఈ గడ్డమీద పుట్టాను. ఈ గడ్డమీదే చావాలి' అంది ఆమె.

అది ఈగడ్డమీది సెంటిమెంటు కాదు. అసలు కారణం బయటకు చెప్పేది గనకనా చెప్పడానికి! పదేళ్ళుగా ఆమెకు రామక్రిష్ణా రెడ్డితో సంబంధం వుంది. ఒకప్పుడు ఆయన బాగా వున్నవాడేకానీ జూదరి. ప్లేయింగ్ కార్డ్స్ రాపిడికి ఆయనచేతిలో అదృష్టరేఖ కాస్తా అరిగిపోయింది. భూమి పుట్రా అన్నీ పోగొట్టుకున్నాడు. ఇప్పుడు పూర్తిగా రత్నమ్మగారే ఆయనకు ఆధారం. తన్ను నమ్ముకున్న వ్యక్తిని, అందునా నిస్సహాయంగా వున్న వ్యక్తిని ఎలా వదలడం? ఒకవైపు పేగులబంధం, ఒకవైపు ఈ బంధం. ఆమె ఎంత అంతఃసంఘర్షణకు గురయిందోలేదో ఆమెకు తెలియాలి. ఆమె అంతరాత్మకు తెలియాలి. కడకు పేగులబంధాన్నే తెంచుకోడానికి నిశ్చయించింది.

రత్నమ్మగారిని ప్రాధేయపడి ఒప్పించలేనని డాక్టరుకు తెలుసు. మరోవైపు నుంచి నరుక్కురావాలి. ఆ పల్లెటూర్లో వున్న భూమి, పుట్రా అమ్మడానికి మొదలు పెట్టాడు. అన్నీ పోగా పదెకరాల భూమి యిల్లు మిగిలాయి. ఇప్పుడు వాటికి ఎసరు పెట్టాడు.

రత్నమ్మ నెత్తీ నోరూ కొట్టుకొని 'నా కు జీవనాధారం ఎలాగా' అంటుంది.

నేనుండగా నీకు మరో జీవనాధారం దేనికమ్మా' అని డాక్టరుగారి మెత్తటి సమాధానం.

రత్నమ్మగారికి ఇప్పుడు రెండే మార్గాలున్నాయి. ఒకటి ఏ ఆధారమూ లేకుండా ఆ పల్లెటూళ్ళో కూలో నాలో చేసుకొని బ్రతకడం లేదా డాక్టరు దగ్గరికి వెళ్ళడం.

కడకు ఈ పేచీ పరిష్కారం ఆమె నానెత్తిన వేసింది. వాస్తవానికి డాక్టరుతో చనువున్న వ్యక్తులు ఆమెకు నేనుగాక మరొకరు కనిపించలేదు. రత్నమ్మగారి పట్ల నాకు సానుభూమి వుంది. కానీ ఆమె అవినీతిని ఎలా సమర్థించడం?

ఈ ఆలోచనల మధ్య సతమతమవుతూ నేను స్నానం ముగించడం కొంచెం ఆలస్యమే అయింది. నేను బాత్‌రూం నుంచి బయటకు వచ్చేసరికి డాక్టరు బయట గదిలో ఎవరితోనో మాట్లాడుతున్నాడు. లోపలి గదిలో రామూ గ్లాసులూ, విస్కీబాటిలూ, సోడాలూ సర్దుతున్నాడు.

'ఏమిటి రామూ?' అన్నాను

మెడికో లీగల్ కేసు తగిలిందని చెప్పలేదూ? లాయరుగారు మాట్లాడటానికి వచ్చారు. అందుకే ఈ ఏర్పాట్లు , మీకోసమే వాళ్ళు వెయిట్ చేస్తున్నారు' అన్నాడు.

మాటలు విని డాక్టరు వచ్చాడు. 'ఏమిటి ఇంత ఆలస్యం? నీ కోసమే చూస్తున్నాం. కూర్చుందామా అన్నాడు.

'నేనెందుకు మధ్యలో, మీరు మాట్లాడుకోవలసిన విషయాలు వుంటాయేమో' అంటూ నసిగాను.

'సీసాముందు కూర్చొని మేమేం శిశుహత్యాపాతకాలు చెయ్యడంలేదు లేవోయ్. ఏవోడబ్బు వ్యవహారాలు అవీ వుంటాయి. ఇట్ ఈజ్ ఆర్డర్ ఆఫ్‌ది డే. రహస్యాలేం లేవు' అంటూ లాయర్ని పిలిచేడు.

పానకంలో పుడక లాగా ఈ మెడికో లీగల్ కేసొకటి వచ్చిపడింది. ఈ వ్యవహారం తెగడానికి ఎంతసేపు పడుతుందో ఏమో! డాక్టరు ఏకాంతంగా దొరుకుతాడని సంతోషిస్తే నాప్రాణానికి ఈ లాయరొకడు దాపురించాడు, నాప్రాణం చివుక్కుమంది. అనాసక్తంగా వాళ్ళతో కూర్చున్నాను.

మొదటి రౌండులో ఏవో రాజకీయాలు మాట్లాడుకున్నారు. రెండో రౌండులో వ్యవహారానికి నాందిగా, లాయరు కోటు జేబులో నుంచి ఏదో కాగితం తీశాడు.

'ఏమిటది?' డాక్టరు ప్రశ్నించాడు

'దావా నకలు'

'అదంతా చదవడం దేనికి? విషయం చెప్పండి చాలు' అన్నాడు డాక్టరు.

'వెరీ సింపుల్ డాక్టర్. మృతుడు ఉదయం ఆరు గంటలకు దొడ్డికివెళ్ళి వస్తున్నాడు. ముద్దాయిలు ముగ్గురూ కొంచెం దూరంలో పొంచి వున్నారు. మృతుడు దగ్గరకు రాగానే ఏ ఒన్ బల్లెంతో కడుపులో

పొడిచాడు. ఏ టూ వీపున పొడిచాడు. మృతుడు క్రింద పడ్డాడు. ఏ త్రీ గొడ్డలి వెనకన కణతమీద కొట్టాడు. దీంతో మీ పోస్టుమార్టమ్ సర్టిఫికెట్ ఫిట్‌యిన్ కావాలి'.

'అంటే నేరం ఆరుగంటల ప్రాంతాల్లో జరిగి వుంటుందనీ వీపుదీ కడుపుమీదిదీ బల్లెం పోట్లనీ కణతల మీదిది గొడ్డలిలాంటి ఆయుధంతో తగిలి వుంటుందనీ రాయమంటారు అంతేనా?' అన్నాడు.

'అంతే, కడుపులో పొడిచిన పోటువల్లే ప్రాణం పోయి వుంటుందని కూడా రాయవలసి వుంటుంది'.

ఇవన్నీ నాకు బొత్తిగా ఆసక్తిలేని విషయాలు. నాకు అక్కడ కూర్చోవడం ముళ్ళమీద కూర్చున్నట్టుంది. త్వరగా వ్యవహారం తెమిలితే బాగుండుననిపిస్తోంది. దాని తర్వాత డబ్బు ప్రసక్తి వచ్చింది. నాలుగువేలకు బేరం సెటిల్ అయింది. లాయరు నోట్ల కట్టలుతీసి డాక్టరుకిచ్చాడు.

నేను టయమ్ చూశాను, తొమ్మిదిన్నర. బాటిల్‌వైపు ఊశాను. ఇంకా రెండు రౌండ్లకు సరిపడావుంది. ఏ పదకొండో కావచ్చు. ఆ తర్వాత భోజనం, రత్నమ్మగారి విషయం ఎప్పుడు మాట్లాడను! ఉదయం బిజీగా ఉంటాడని తెలుస్తూనేవుంది. నా ప్రాణం కడగట్టిపోతూంది. నా మనసులోని ఆరాటం గ్రహించినట్టుగా ఆ లాయరులేచి నిలబడి "నేను వెళ్తాను డాక్టర్" అన్నాడు.

"అప్పుడే" అన్నాడు డాక్టరు.

"సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి స్టేట్‌మెంట్సూ అవీ తయారుచేయించాలి. మర్డర్‌కేస్ గదండీ చాలా పనులున్నాయి. వెళ్తాను" అన్నాడు.

నేను మనసులో ఆ లాయరుకు శతకోటి నమస్కారాలు పెట్టుకున్నాను. మా డాక్టరు ముఖం కూడా కళకళలాడుతోంది. అంటే నేను మాట్లాడటానికి ఇంతకన్నా మంచి అదను దొరకదు. కానీ డాక్టరు నాతో ఏవో తన వృత్తికి సంబంధించిన విషయాలు చెబుతున్నాడు. తన సంపాదన మూడు పువ్వులూ ఆరుకాయలుగా వున్న వైనం చెబుతున్నాడు. ఎవడి లోకం వాడిది. సరే కాసేపు డాక్టరు వాగ్ప్రవాహాన్ని ఆపడమెందుకులెమ్మని శ్రద్ధగా వింటున్నట్టు మొగంపెట్టి కూర్చున్నాను.

నేను బయలుదేరిన వేళావిశేషం మంచిది కానట్లుంది. మరో వ్యక్తి చాలా ఆత్రంగావచ్చి మాతో కూర్చున్నాడు. ఆయన డిఫెన్స్ తరపున జూనియర్ లాయరట. రెడ్డొచ్చె మొదలాడు అన్నట్టు మళ్ళీ వ్యవహారం మొదలైంది.

'మీరు చాలా ఆలశ్యంగా వచ్చారు' అన్నాడు డాక్టరు.

"ఏం చెయ్యను చెప్పండి. ఆ క్లయింట్స్ ముండాకొడుకులు తీరా యిప్పుడొచ్చి పీకలమీద కూర్చున్నాడు. ఆదరాబాదరా పరుగెత్తుకుంటూ వచ్చాను. ప్రాసిక్యూషన్‌వాళ్ళు మిమ్మల్ని కనుక్కొని వెళ్ళారేమిటి?" అన్నాడు.

"రాజు అటువెళ్ళాడు మీరు యిటు వస్తున్నారు"

"ఆ రాజుగాడు కోర్టులో నోరుతెరచి ఒక ముక్క మాట్లాడలేదు. ఇల్లాంటి పనుల్లో మటుకు ముందుంటాడు. ఏం రాయమని అడిగాడు" అన్నాడు లాయరు.

"ముందు గ్లాసు తీసుకోండి చెబుతాను" అంటూ డాక్టరు విస్కీగ్లాసు అందించాడు. ఇక నా పని ఈపూట కాదని నిర్ధారణ చేసుకున్నాను. డాక్టరుగారి ఆధీనంలో శవం ఉంది. లాయరు రాబందులు రెక్కలు విప్పి ఆడుతున్నాయి. డాక్టరు మహదానందపడిపోతున్నాడు. నాకేమో శవజాగరణగా వుంది. ఇందాక లేదుగానీ ఈ కేసుపట్ల కాస్త ఆసక్తి పెరిగింది. వాళ్ళమాటలు వింటూ కూర్చున్నాను.

ప్రాసిక్యూషన్ లాయరు ఏం రాయమన్నాడో విపులంగాచెప్పి, "ఇంకా మీకేమైనా పాయింట్లు మిగిలి వున్నాయేమో చూడండి" అన్నాడు డాక్టరు.

లాయరు కాస్సేపు ఆలోచించి, "మంచి పాయింటే వుంది. మీరు రాస్తానంటే చెబుతాను" అన్నాడు.

"మీకు ఏనాడు కాదన్నాను చెప్పండి"

"మృతుడు దొడ్డికి వెళ్ళివస్తున్నట్లు దావాలో వుంది. మనం దాన్ని అబద్ధం చెయ్యాలి ప్రేవుల్లో మలం వున్నట్లు రాయండి. కాన్స్టిపేషన్ వుందని వాళ్లు సంజాయిషీ చెప్పుకోవచ్చు. యూరినల్ బ్లాడర్‌లో యూరిన్ వున్నట్లు కూడా రాస్తే దానికి విరుగుడౌతుంది" అన్నాడు లాయరు సగర్వంగా.

తను రాయడానికి మరో పాయింటు మిగిలే వున్నందుకు డాక్టరు ముఖం వికసించింది. ఇక లాయరు విషయం సరేసరి. ఏదిఏమైతేనేం కానీ డాక్టరుగారి జేబులోకి మరో ఐదువేలు చేరింది. ఈ తతంగమంతా ముగిసేసరికి బాగా పొద్దుపోయింది. డాక్టరుగారి కాళ్లు భూమిమీద ఆనటం లేదు. తీసికెళ్ళి బెడ్‌మీద పడుకోబెట్టి, నేనూ వెళ్ళి పడుకున్నాను.

పడుకున్నానుగానీ నిద్రరావడం లేదు. నా ఆలోచనల పరిధికాస్త విస్తృతమైనట్లుగా వుంది. కొత్త ఆలోచనలు నా మెదడ్లో తొలవడం ఆరంభించాయి. ఇప్పటివరకూ రత్నమ్మగారి తప్పును బూతద్దంలో చూశానేమో ననిపించింది. మేధావులుగా, గౌరవనీయులుగా చెలామణీ అవుతున్న లాయర్లు, డాక్టర్లు లాటివాళ్లు వృత్తి ధర్మాల్ని ఖూనీ చేస్తున్నారు. సామాజిక బాధ్యతల్ని విస్మరిస్తున్నారు. చిత్రమేమిటంటే ఇటీస్ ఆర్డర్ ఆఫ్ ది డే! మరి రత్నమ్మగారిలాటి వ్యక్తి సుఖాన్వేషణలో కొంచెం స్వేచ్ఛ తీసుకుంటే అది గొప్ప అవినీతి కింద చెలామణీ కావాలా?

చక్కటి డిఫెన్సు థియరీ దొరికిన లాయరులాగా సంతోషించాను. రత్నమ్మగారి విషయం డాక్టరుతో మాట్లాడటానికి నేను కించపడవలసిన పని లేదనిపించింది.

నేను ఉదయం లేచేసరికే డాక్టరు హాస్పిటల్‌కు వెళ్ళే హడావిడిలో ఉన్నాడు.

డాక్టరు దగ్గరికి వెళ్ళి "నీతో కొంచెం మాట్లాడాలి" అన్నాను.

డాక్టరు ముఖం చిట్లించుకుని "నువ్వు ఏం మాట్లాడదలచుకున్నావో నాకు తెలుసు. ఆ తప్పుడు మనిషి తరఫున వకాల్తా పుచ్చుకొని మాట్లాడడానికి నీకు సిగ్గులేదూ?" అన్నాడు.

ఇక నేనేం మాట్లాడను?

- (జనవరి 79, సౌమ్య మాసపత్రిక)